సాక్షి
పల్నాడు

మంగళవారం ၊ 2 ၊ సెప్టెంబర్ ၊ 2025




అభినందనలు
నగరంపాలెం: కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఎంపికైన హోంగార్డులు సోమవారం ఎస్పీ సతీష్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఎస్పీ అభినందించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,55,878 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 2,76,599 క్యూసెక్కులు వదులుతున్నారు.

మొక్కజొన్నలతో పూజలు



నరసరావుపేటఈస్ట్: నరసరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోని గణపతికి సోమవారం 1108 మొక్కజొన్న కండెలతో సహస్ర అష్టోత్తర పూజ నిర్వహించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో యూరియా కొరత లేదు

రైతులు ఆందోళన చెందవద్దన్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు 34,556 మెట్రిక్ టన్నుల వినియోగం అంచనా వేయగా, ప్రభుత్వం ఇప్పటికే 34,418 టన్నులు సరఫరా చేసిందన్నారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ వంటి అన్ని రకాల ఎరువులు కలిపి జిల్లాకు 1,09,347 మెట్రిక్ టన్నులు మంజూరు కాగా. ఇప్పటి వరకూ 58,673 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశామని, మరో 50,674 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు జిల్లా కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. అనవసర భయాలతో అవసరానికి మించి యూరియా కొనుగోళ్లకు రైతులు దూరంగా ఉండాలన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్



గుంటూరు లీగల్: ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయడానికి ప్రయత్నం చేయాలని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సివిల్ జడ్జిలకు, పోలీస్ అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి వి.ఏ.ఎల్. సత్యవతి, మూడో అదనపు జిల్లా జడ్జి సీహెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు, రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, ఐదో జిల్లా జడ్జి స్పెషల్ కోర్ట్ ఫర్ ది ట్రయిల్ అఫ్ ఆఫెన్సెస్ అగైనెస్ట్ విమెన్ కె.నీలిమ పాల్గొన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి తగు సలహాలు, సూచనలు చేశారు.

బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన వాహనం



తెనాలిరూరల్: తెనాలి ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గణేష్ నిమజ్జనం కోసం ఉపయోగించిన డీజే సౌండ్ సిస్టంలను తీసుకెళుతున్న ఓ వాహనం బ్రిడ్జి మొదట్లో నిలిచిపోయింది. ఫుట్‌పాత్, డివైడర్‌కు మధ్యలో వాహనం నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అతి కష్టం మీద వాహనాన్ని తొలగించాల్సి వచ్చింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ అంతరాయంతో సుమారు గంట పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వంతెనపై వాహన రాకపోకలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మెలను పక్కకు జరిపి ఇరుక్కుపోయిన వాహనాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

వైఎస్ఆర్.. ఆ పేరే ఒక ప్రభంజనం
- ఎవరూ చెరపలేని, మరువలేని సజీవ సంక్షేమ సంతకం
- పేదింటి గుండె కోవెలలో నేటికీ ఆయన సజీవం
- అన్నదాతల చిక్కటి చిరునవ్వుల్లో ఆయన చిరునామా పదిలం
- డాక్టర్లుగా, ఇంజినీర్లుగా మారిన పేదింటి బిడ్డల హృదయాల్లో ఆయన స్థానం చిరస్మరణీయం
- ఆయనంటే నమ్మకం.. ఆయనుంటే జన సందోహం
- ఉమ్మడి జిల్లాపై మహానేత మమకారం అపూర్వం
- జిల్లా అభివృద్ధిపై ఆయన ముద్ర శాశ్వతం



జిల్లా అభివృద్ధిపై రాజముద్ర

రాజన్నా.. నిను మరువలేమన్నా

- ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధిపై వైఎస్సార్ చెరగని ముద్ర
- పులిచింతల నిర్మాణంతో తీరిన అన్నదాతల చింతలు
- రూ.వేల కోట్లతో సాగర్ కాల్వల ఆధునికీకరణ
- మహానేత చివరి సంతకమూ ఇక్కడి రైతుల కోసమే..
- గుంటూరు నగర ప్రజల దాహార్తిని తీర్చిన రాజన్న
- నేడు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం



2004 అక్టోబర్ 15న పులిచింతల ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మహానేత వైఎస్సార్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతును రాజును చేయాలని అహర్నిశలు కలలుగన్న రైతుబాంధవుడు దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఆ మహానేత ముందుకు వెళ్లారు. జలయజ్ఞంలో భాగంగా పులిచింతల ప్రాజెక్టు రూపకల్పనతో పాటు ఆయకట్టు స్థిరీకరణ కోసం పాటు పడ్డారు. రైతుల బతుకు చిత్రాన్ని మార్చడం కోసం కలలు కన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల చిరకాల స్వప్నమైన పులిచింతల ప్రాజెక్టును ఆయన అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే 2004 అక్టోబరు 15వ తేదీన రూ. 680 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు విజయవాడ, గుంటూరు నగర ప్రజల దాహార్తి తీర్చడంతోపాటు కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడానికి ఉపయోగపడుతోంది. ఈ మధ్యకాలంలో వర్షాభావ పరిస్థితులు వచ్చినా సరే కృష్ణా డెల్టాకు నీటి ఇబ్బంది లేకపోవడానికి పులిచింతల ప్రాజెక్టే కారణం అనడంలో అతిశయోక్తి లేదు.

జలయజ్ఞంతో సస్య శ్యామలం

నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం 2008 ఫిబ్రవరి 2న రూ.4,444.41 కోట్లతో నాగార్జున సాగర్ కుడి, ఎడమల కాలువల ఆధునికీకరణకు అనుమతి ఇచ్చారు. దీని ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కాలువల ఆధునికీకరణ కోసం రూ. 4,573 కోట్లు కేటాయించారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి రూ.1760.15 కోట్లను కేటాయించారు. ఇందులో రూ.1187 కోట్ల పనులు జరిగాయి. దీని ద్వారా జిల్లాలో 5.22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. మహానేత పదవీకాలంలో ఉమ్మడి జిల్లా వాసులకు ఉపయోగపడే ఎన్నో ప్రాజెక్టులను ఆయన పూర్తి చేసి జిల్లా అభివృద్ధిపై చెరగని ముద్రను వేసుకున్నారు.

ఉమ్మడి జిల్లాపై చెరగని ముద్ర

- రాష్ట్ర వ్యాప్తంగా రూ. 12వేల కోట్ల రుణమాఫీలో జిల్లా రైతులు దాదాపు 6.07 లక్షల మందికి రూ. 560 కోట్ల మేర లబ్ధి చేకూరింది.
- ఇందిర ప్రభ పథకం జిల్లాలో ప్రారంభించి ఉమ్మడి జిల్లా రైతులకు పెద్ద పీట వేశారు.
- ఇందిరమ్మ ఫేజ్–2 ఇళ్లను జిల్లాలోనే ప్రారంభించారు.
- రాజీవ్ పల్లెబాట ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరందించి పల్లె వాసుల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారు.
- గుంటూరు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ. 6.50 కోట్లతో తక్కెళ్లపాడు రా వాటర్ ప్లాంట్ నుంచి తక్కెళ్లపాడు నీటి శుద్ధి వాటర్ ప్లాంట్ల వరకు రెండో పైపు లైను నిర్మించారు. తమ నీటి కష్టాలు తీర్చిన మహానేతను నగర ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.
- 2008, జూన్ 5న ప్రాజెక్టు వద్ద రైతు సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్ పెదకూరపాడు నియోజకవర్గంలోని పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు మండలాల్లో సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు కృష్ణానది నుంచి సాగునీటిని అందించేందుకు ఒకే సారి 10 ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు రూ.250కోట్ల నిధులు మంజూరు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఇప్పుడు ఆ పథకాలు మొత్తం పూర్తి కావడం వల్లనే నియోజకవర్గంలో పంట పొలాలు సాగునీటితో కళకళలాడుతున్నాయి.
- రూ.460 కోట్లతో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన తాగునీటి పథకానికి ఆయనే అంకురార్పణ చేశారు.
- విద్యుత్ బకాయిలు మాఫీ చేయడం ద్వారా జిల్లాలో 80 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. విద్యుత్ బకాయిల మాఫీ ద్వారా జిల్లాలోని రైతులకు రూ. 36 కోట్ల లబ్ధి కలిగింది.
- అమరావతి మండలం నరుకుళ్లపాడులో లెవెల్ బ్రిడ్జిలో పడి ఎనిమిది మంది మృతి చెందడంపై డాక్టర్ వైఎస్సార్ తీవ్ర మనస్తాపానికి గురై ప్రమాదకరంగా ఉన్న నరుకుళ్లపాడు, ఎండ్రాయి బ్రిడ్జిలను హైలెవెల్ చేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఆ రెండు బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి కావడంతో ఇప్పుడు ఎంత వర్షం పడినా ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవు.
- ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలోని 80 వేల మంది రైతులకు ఏడాదికి రూ. 281.60 కోట్ల లబ్ధి చేకూరింది. దీంతోపాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిరుపేదల పాలిట అపర సంజీవనిగా పేరొందిన ఆరోగ్యశ్రీ పథకాన్ని 2008లో గుంటూరు నుంచి ఆయన ప్రారంభించి జిల్లా ప్రజలు మరిచిపోలేని విషయం.

చివరి సంతకం ఇక్కడి రైతుల కోసమే..

వైఎస్సార్ చివరి సంతకం చేసిన ఫైల్ కూడా జిల్లాలో మిర్చి రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద ప్రయోజనం చేకూర్చేదే. ఈ బీమాతో జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిర్చి రైతులు ఎకరానికి రూ.లక్ష వరకూ నష్టపోయారు. వారిని ఆదుకుంటామని ప్రకటన చేసినా ఇంతవరకూ పైసా కూడా విదల్చలేదు. దీంతో జిల్లా రైతులు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకుంటున్నారు.

ముఖ్యమంత్రి హోదాలో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జిల్లాలో 57 సార్లు పర్యటించారంటే ఆయనకు జిల్లాపై ఉన్న మమకారం అర్థం అవుతుంది.



నరసరావుపేటలో జ్యోతి వెలిగించి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభిస్తున్న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి(ఫైల్)



ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి చిన్నారిని పరీక్షిస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ (ఫైల్)



నరసరావుపేట పట్టణాభివృద్ధి పైలాన్‌ను ఆవిష్కరించి అభివాదం చేస్తున్న మహానేత (ఫైల్)

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 92 అర్జీలను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్ఓ మురళిలతో కలిసి స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తి ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు ఉండాలన్నారు. ఆర్డీఓ కె.మధులత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్, అధికారులు

వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయండి



దళితులకు సొసైటీ పేరుతో కేటాయించిన 416 ఎకరాల్లో జీఓ 270 ప్రకారం ఏపీఎండీసీకి కేటాయించిన 223 ఎకరాల భూముల్లో నాలుగేళ్ల నుంచి ఎటువంటి పనులు చేపట్టలేదు. ఆ భూములపై జిల్లా కలెక్టర్‌కు పూర్తి అధికారం ఉంది. మిగిలిన 193 ఎకరాలతో కలిపి సొసైటీ సభ్యులు అందరికీ వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయండి. సాగు చేసుకుంటున్న దళిత రైతులకు అధికారుల నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడండి.

–ఎస్సీ, ఎస్టీ రైతులు, యడవల్లి

రోడ్డుపై నడిచే అవకాశం కల్పించండి



గ్రామంలో బొడ్డురాయికి సమీపంలోని నా ఇంటి ముందు పదేళ్ల క్రితం పంచాయతీ నిధులతో వేసిన సీసీ రోడ్డుపై మా పక్కింటి ఇంటియజమాని సాంబశివరావు నన్ను, కుటుంబ సభ్యులను నడవనీయకుండా అడ్డుకుంటున్నాడు. నడిస్తే దూషిస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకొని నాకు రోడ్డుపై నడిచే అవకాశం కల్పించండి.

– చల్లా శ్రీనివాసరావు, ములకలూరు, నరసరావుపేట మండలం

రేషన్ బియ్యం.. రైట్ రైట్!

- జిల్లాలో యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా
- రాష్ట్ర సరిహద్దులు దాటి తెలంగాణకు వెళ్తున్న పేదల బియ్యం
- పొందుగల, తంగెడ, సాగర్ చెక్‌పోస్టుల మీదుగా వెళ్తున్న లారీలు
- రేషన్ మాఫియాతో కుమ్మక్కైన ఏపీ చెక్‌పోస్టుల సిబ్బంది
- వందల మీటర్ల దూరంలోని తెలంగాణ చెక్‌పోస్టు వాడపల్లి వద్ద పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం
- లారీలు సరిహద్దు దాటించేందుకు ప్రత్యేకంగా ఏజెంట్లు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం రవాణా పెద్ద ఎత్తున జరుగుతోంది. ప్రతి నెలా వేల టన్నుల బియ్యం జిల్లా సరిహద్దుల మీదుగా తెలంగాణ రాష్ట్రానికి తరలివెళుతోంది. జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల సిబ్బంది లారీలను పట్టుకోకపోగా.. రైట్ రైట్ అంటూ రాష్ట్ర సరిహద్దులను దగ్గరుంచి దాటిస్తున్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. పేదల బియ్యంతో వ్యాపారం చేస్తున్న అక్రమార్కులకు స్థానిక పౌరసరఫరాలు, విజిలెన్స్, పోలీసు అధికారులు అండగా నిలుస్తుండటంతో మరింత రెచ్చిపోయి పట్టపగలే సరిహద్దులు దాటిస్తున్నారని సమాచారం.



తెలంగాణ సరిహద్దులోని వాడపల్లి చెక్‌పోస్టులో పట్టుకున్న బియ్యం లారీ (ఫైల్)

పల్నాడులో పట్టుకోరంతే...!

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని రేషన్ బియ్యాన్ని స్థానిక డీలర్ల నుంచి రేషన్ మాఫియా కిలో సుమారు రూ.14 దాకా కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని వినుకొండ, సంతమాగులూరు, పిడుగురాళ్ల, సత్తెనపల్లి పరిధిలోని రైస్ మిల్లులలో పాలిష్ చేసి సంచులను మారుస్తున్నారు. సదరు మిల్లులపై దాడులు చేసి పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న దాఖలాలు లేవు. పాలిష్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ.36 వరకు ఒడిశా, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఎక్కువ భాగం బియ్యం లారీలు తొలుత తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయి. పల్నాడు జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులైన పొందుగల, తంగెడ, నాగార్జునసాగర్‌ల మీదుగా తెలంగాణ లోకి ప్రవేశిస్తున్నాయి. ఈ చెక్‌పోస్టుల మీదుగా పీడీఎస్ బియ్యం లారీలు వెళ్తున్నా పట్టుకుంటున్న దాఖలాలు లేవు. రేషన్ మాఫియా వాళ్లలో వాళ్లకు గొడవలు వచ్చి పట్టిస్తున్న అరకొర సరకు తప్ప పెద్ద మొత్తంలో వెళ్తున్న బియ్యం లారీలు దర్జాగా సరిహద్దులు దాటేస్తున్నాయి.

తెలంగాణలో చిక్కేస్తున్నారు...

ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టుల నుంచి తెలంగాణ వైపు వెళ్తున్న పీడీఎస్ బియ్యం లారీలు తెలంగాణ చెక్‌పోస్టుల వైపు వెళ్లగానే పట్టుబడిపోతున్నాయి. దాచేపల్లి మండలం పొందుగల చెక్‌పోస్టు నుంచి దర్జాగా వెళ్లిన బియ్యం లారీలు వందల మీటర్ల దూరంలో కృష్ణానది అవతల ఉన్న తెలంగాణ పరిధిలోని వాడపల్లి చెక్‌పోస్టులో పట్టుబడుతున్నాయి. జూలై 4న వాడపల్లి అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద 600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో వెళ్తున్న రెండు లారీలను సాధారణ తనిఖీలలో పట్టుకున్నారు. ఆ లారీలను పొందుగల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు పట్టించుకోలేదు. గత నెల 5వ తేదీన మరోసారి అదే చెక్‌పోస్టులో 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తెలంగాణ పోలీసులు సీజ్ చేశారు. ఈ లారీ గుంటూరు జిల్లా చేబ్రోలు నుంచి పల్నాడు జిల్లా మీదుగా పొందుగల చెక్‌పోస్టు దాటుకొని తెలంగాణలో ప్రవేశించింది. ఏ ఒక్క అధికారి దీన్ని ఆపిన పాపన పోలేదు. తెలంగాణ బోర్డర్‌లో దొరికిన అవే బియ్యం లారీలు నిమిషాల వ్యవధిలో అర కిలోమీటర్ లోపున్న చెక్‌పోస్టును దాటుతుంటే ఎందుకు పట్టుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చెక్‌పోస్టు సిబ్బంది మొదలు అధికారుల వరకు రేషన్ మాఫియా నుంచి లంచాలు తీసుకోవడంతో చూసీచూడనట్టు వదిలేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక టీడీపీ నేతల ఆధ్వర్యంలో నడుస్తున్న రేషన్ మాఫియా అక్రమాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వారికి ప్రభుత్వ అధికారుల సహకారం ఉండటంతో మరింత రెచ్చిపోతున్నారు.

అంతా వారే చూసుకుంటారు

గుంటూరు జిల్లా మొదలు నల్గొండ వరకు పల్నాడు మీదుగా ప్రయాణిస్తున్న పీడీఎస్ బియ్యం లారీలను ఏ చెక్‌పోస్టులో అడ్డుకోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఏజెంట్లు పనిచేస్తున్నారు. రైస్ మిల్లుల నుంచి అంతర్రాష్ట్ర మాఫియాకు బియ్యం అప్పగించేవరకు వీరు రూట్ ఆఫీసర్లుగా పనిచేస్తారు. పోలీసులతో సన్నిహితంగా ఉంటూ వారికి నెలవారీ మామూళ్లు అప్పగించి లారీలను ఆపకుండా చూడటం ఈ ఏజెంట్ పని. స్టేషన్, అధికారి స్థాయిని బట్టి నెలకు రూ.50వేల నుంచి రూ.1.50 లక్షల దాకా మామూళ్లు ఇస్తున్నట్టు గత నెలలో అరెస్టయిన ఏజెంట్ వాంగ్మూలంలో బయటపెట్టినట్లు భోగట్టా. తెలంగాణ పోలీసులకు సైతం లంచాలు ఇస్తూ లారీలు దాటిస్తున్న ఏజెంట్‌లకు నెలకు రూ.2 లక్షల దాకా మిగులుతున్నట్టు తెలుస్తోంది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,400** గరిష్టం : రూ. **3,200**

మోడల్‌ ధర రూ. **2,800**

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	40,877
అమ్మకాలు	38,663
నిల్వ	7,718
నాన్‌ ఏసీ కామన్‌ రకం క్వింటా (రూ.)	
334	10,000–14,200
నంబరు–5	10,000–13,400
341	10,000–15,300
ఏసీ కామన్‌ రకం క్వింటా (రూ.)	
334	10,500–14,200
నంబరు–5	10,000–13,500
341	11,000–15,500
4884	10,000–13,500
నాన్‌ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
షార్క్‌–1	10,000 – 15,400
సంగీ బాడిగ 5531	10,000 – 14,600
ఆర్మూర్‌	9,800 – 12,200
తాలుకాయలు	6,200 – 7,800
ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
షార్క్‌–1	10,000 – 15,300
సంగీ బాడిగ 355	10,000 – 14,500
దువనూర్‌ డీలక్స	10,500 – 13,500
తాలు	5,400 – 7,300

–కొరిటెపాడు (గుంటూరు)

వ్యాపారం పేరుతో ఎన్‌ఆర్‌ఐకు టోకరా

- నమ్మించి రూ.కోటికి పైగా మోసం
- పీజీఆర్‌ఎస్‌లో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుకు ఫిర్యాదు
- పలు సమస్యలపై 65 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్‌: వ్యాపారం పేరుతో ఎన్‌ఆర్‌ఐకు టోకరా, కుమారులను విదేశాలకు పంపేందుకు ఆర్థిక సహకారం అందించిన సోదరుడికి నగదు చెల్లించకుండా చేస్తున్న వేధింపులపై జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాయలంలో సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి, మోసం తదితర సమస్యలపై 65 ఫిర్యాదులు అందాయి.

సోదరుడు మోసం

ముప్పాళ్ల మండలం తురకపాలేనికి చెందిన దాసరి జోసఫ్‌ తంబికుమార్‌ నాల్గవ సోదరుడు అంతయ్య నరసరావుపేట రెడ్డినగర్‌లో నివసిస్తున్నారు.

అంతయ్య కుమారులు జర్మనీలో చదువుల నిమిత్తం రూ.33.50లక్షలను 2019 నుంచి పలు దఫాలుగా తంబికుమార్‌ అందించారు. పిల్లలు చదువులు పూర్తిచేసి స్థిరపడినప్పటికీ నగదు చెల్లించడంలేదు. పలుమార్లు అడగటంతో అంతయ్య ప్రోనోట్లు రాసిఇచ్చాడు. వాటి కాలం తీరిపోవడంతో తిరిగి రాయమని అడగ్గా మభ్యపెడుతూ మోసగిస్తూ వస్తున్నాడు. దీనిపై న్యాయం చేయాలని ఎస్పీని తంబికుమార్‌ కోరాడు.

మోసం వలలో ఎన్‌ఆర్‌ఐ

నరసరావుపేటలో వీసా కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న తాడువాయి వెంకటేశ్వరరావు సోదరుడు అశోక్‌బాబు అమెరికాలో జీవిస్తున్నాడు. వీరిద్దరికి కామన్‌ స్నేహితుడైన పెరుమాళ్ల సాయి జస్వంత్‌ తాను విజయవాడలో కొనుగోలు చేసిన ప్లాట్‌కు చెల్లించేందుకు రూ.52లక్షలను 2024లో అశోక్‌బాబు నుంచి అప్పుగా తీసుకున్నాడు. స్నేహితుడైన తక్కెళ్లపాటి అఖిలేష్‌తో కలిసి మార్బుల్‌ వ్యాపారం చేద్దామని అశోక్‌బాబును నమ్మించి సాయిజస్వంత్‌ రూ. 51.40లక్షలు తమ అకౌంట్లకు బదిలీ చేయించుకున్నారు. ఇప్పటి వరకు వ్యాపారం మొదలు పెట్టకపోవడంతో మోసపోయానని గ్రహించి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

ఆస్తి కోసం హత్యాయత్నం

రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెందిన తుర్లపాటి శ్రీనివాసరావుపై గత నెల 8న సోదరుడు, సోదరి తరపు వ్యక్తులు గొడ్డళ్లు, రాడ్‌లతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో శ్రీనివాసరావు నడవలేని స్థితిలో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాడు. తనపై దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయకుండా రొంపిచర్ల పోలీసులు సాధారణ కేసు నమోదు చేయడంపై జిల్లా ఎస్పీకి పిర్యాదు చేశాడు. తనకు చెందిన పంటపొలాన్ని సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపాడు. రక్షణ కల్పించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

వివాహం చేసుకొని మోసం

అచ్చంపేట మండలం కస్తల గ్రామానికి చెందిన పాటిబండ్ల మౌనిక భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. గ్రామానిక చెందిన జాన్‌బెన్ని ఆమె ఇంటికి వచ్చి వేధిస్తుడటంతో పెద్ద మనుషుల మధ్య పంచాయతీ నడిచింది. తరువాత మౌనికను నమ్మించి అమరావతిలో గత నెల 15వ తేదీ వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత నుంచి వేధిస్తుడంతో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసింది.

కంచే చేను మేసింది!

- ఓనర్‌కు కాపలాదారు కుచ్చుటోపీ
- రూ.4 లక్షల మెటీరియల్‌ చోరీ

నాదెండ్ల: ఇంటి యజమానిని మోసం చేసి రూ.4 లక్షలకు పైగా మెటీరియల్‌ అమ్ముకుని చెక్కేసిన ఉదంతం సోమవారం వెలుగులోకి వచ్చింది. సాతులూరు గ్రామానికి చెందిన రాయపూడి నవకుమార్‌ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో చర్చి పాస్టర్‌గా పని చేస్తుంటారు. వారంలో కొన్నిరోజులు నరసాపురంలో మరికొన్ని రోజులు స్వగ్రామమైన సాతులూరులో ఉంటారు.

ఇటీవల స్వగ్రామంలో ఇంటి నిర్మాణం ప్రారంభించారు. మెటీరియల్‌కు కాపలాగా జె. శ్రీను అనే వ్యక్తిని నెలకు రూ.5 వేలు వేతనంపై కాపలాదారుగా నియమించారు. ఇంటి నిర్మాణం కోసం ఇనుము, ఇసుక, సిమెంటు, ఇటుక, కంకర సిద్ధం చేసుకున్నారు. ఆదివారం సాతులూరు గ్రామానికి వచ్చిన నవకుమార్‌, ఇంటి నిర్మాణ మెటీరియల్‌ కనిపించకపోవటంతో కాపలాదారుని అడిగేందుకు ప్రయతి్నంచగా అతనూ అందుబాటులోకి రాలేదు. చుట్టుపక్కలవారిని విచారించగా, కాపలాదారుడైన శ్రీను మెటీరియల్‌ను దొంగిలించాడని వివరించారు. దీనిపై బాధితుడు నవకుమార్‌ నరసరావుపేట ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

నిండుకుండలా టెయిల్‌పాండ్‌ రిజర్వాయర్‌

పులిచింతలకు 3,41,297 క్యూసెక్కులు విడుదల



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్‌ టెయిల్‌పాండ్‌ విద్యుత్‌ ప్రాజెక్టు రిజర్వాయర్‌ నుంచి 19 క్రస్ట్‌ గేట్లు ద్వారా 3,41,297 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. టెయిల్‌పాండ్‌ రిజర్వాయర్‌ నిండుకుండలా ఉందన్నారు. టెయిల్‌పాండ్‌ ప్రాజెక్టు రిజర్వాయర్‌ 19 క్రస్ట్‌గేట్లు 3.50 మీటర్లు ఎత్తు ఎత్తి 3,41,297 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటి మట్టం 75.50 మీటర్లకు గాను 74.47 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్‌ గరిష్ట సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.389 టీఎంసీలు ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్‌ 62.08 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్‌ ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్‌ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

మా పొట్ట కొడితే కచ్చితంగా పాపం తగులుతుంది !

- గత ప్రభుత్వంలో రూపాయి తీసుకోకుండా ఉద్యోగాలు కల్పించారు
- ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణను కలిస్తే పొట్ట కొట్టనన్నారు
- మా ఉద్యోగాలతో డీఎన్‌ఆర్‌కు సంబంధం ఏమిటి ?
- కొమెరపూడి సబ్‌స్టేషన్‌ వద్ద మీడియాతో షిఫ్ట్‌ ఆపరేటర్ల ఆవేదన



మాట్లాడుతున్న షిఫ్ట్‌ ఆపరేటర్లు

సత్తెనపల్లి: తమ పొట్ట కొడితే కచ్చితంగా పాపం తగులుతుందని సబ్‌స్టేషన్లలో తొలగించిన షిఫ్ట్‌ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఎదుట సోమవారం తొలగించిన 13 మంది షిఫ్ట్‌ ఆపరేటర్లు మీడియా సమావేశంలో మాట్లాడారు. చల్లగుండ్ల సబ్‌ స్టేషన్‌ షిఫ్ట్‌ ఆపరేటర్‌ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏ కారణంతో తొలగిస్తున్నారో నోటీసు ఇస్తే సంజాయిషీ చెప్పుకుంటామంటే పైనుంచి రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని చెబుతున్నారన్నారు. అధికారుల సూచన మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసేందుకు 4, 5 సార్లు ప్రయత్నించినా పార్టీ ఆఫీస్‌ వద్ద అందుబాటులో లేకపోవడంతో గుంటూరు వెళ్లి 19 మంది ఆయన్ను కలిశామని తెలిపారు. ఉద్యోగాలు చేసుకోండని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారన్నారు. తిరిగి ఏఈని కలిసి ఎమ్మెల్యే ఉద్యోగాలు చేసుకోమని చెప్పారని తెలియజేశామని వివరించారు.

రాజకీయ ఒత్తిళ్లు

రీజాయిన్‌ గురించి అడగటంతో ఏఈ మళ్లీ రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయని, పై వాళ్లను కలవమని చెప్పారన్నారు. గత ప్రభుత్వంలో తమ టాలెంట్‌ చూసి జాబు ఇచ్చినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల సత్తెనపల్లి సబ్‌స్టేషన్‌–3లో రాజకీయ నాయకులు మీడియా సమావేశం పెట్టరని, అక్కడికి వచ్చిన వాళ్లంతా డీఎస్‌ఆర్‌ దగ్గర బేరసారాలు కుదుర్చుకొని వచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అంబటి రాంబాబును కోరితే ఉద్యోగం కల్పించారని, ఆయన ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని చెప్పారు. కొత్త సబ్‌స్టేషన్స్‌ రావడంతో కొత్తగా జాబులు ఇచ్చారే తప్పా ఎవరినీ తొలగించి ఇవ్వలేదని తెలిపారు. సత్తెనపల్లి సబ్‌స్టేషన్‌–3లో కొత్తగా వచ్చిన షిఫ్ట్‌ ఆపరేటర్లు అంతా డీఎస్‌ఆర్‌ అంటున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యం వచ్చిందని తెలివిగా డీఎస్‌ఆర్‌ అని చెబుతున్నారని, ఇక్కడ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణా లేక ఆయనో చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జాబులు చేసుకోమంటే డీఎస్‌ఆర్‌ ఆపుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై సత్తెనపల్లి, నరసరావుపేటలో ధర్నాలు చేసి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ఉద్యోగాలు వచ్చే వరకు పోరాటం ఆగదని కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో తొలగించబడిన షిఫ్ట్‌ ఆపరేటర్లు వజ్రాల వీరారెడ్డి, చింతా సుధీర్‌బాబు, మాబు సుభాని, అన్నపరెడ్డి అఖిల్‌రెడ్డి, వెంకట రెడ్డి, పవన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు, ఓర్సు నరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో తొలగించిన షిఫ్ట్‌ ఆపరేటర్లు రవినాయక్‌, సుబ్బారావు, అబ్దుల్‌బాషా పాల్గొన్నారు.

అధికార పార్టీ సభలకు డ్వాక్రా మహిళలు

- అధికారులకు పచ్చ నేతల హుకుం జారీ
- రాకపోతే బెదిరింపులు

సాక్షి టాస్క్‌ ఫోర్స్‌: స్వయం ఉపాధిలో ఏళ్లుగా దేశానికి ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌ డ్వాక్రా మహిళలు, ఇప్పుడు అధికార పార్టీ సభలకు ప్రధాన వీక్షకులుగా మారుతున్నారు. ఆ సభతో ఎలాంటి సంబంధం లేకున్నా సరే, వారు తప్పనిసరిగా రావాల్సిందే ! లేదంటే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని పచ్చ నేతలు బెదిరిస్తారు. రుణాలు రాకుండా చేస్తామని హెచ్చరిస్తారు. మహిళలను తీసుకురాని అధికారులను, లక్ష్యాలకు చేరుకోలేదని వేధిస్తారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలంటేనే డ్వాక్రా మహిళలు, సంబంధిత అధికారులు బెంబేలెత్తిపోతున్నారు.

బలవంతంగా తరలింపు

ముఖ్యమంత్రి మొదలుకుని, మంత్రులు, ఎమ్మెల్యేల సభలు, సమావేశాలకు సోమవారం పిడుగురాళ్లలో జరిగిన సభకు డ్వాక్రా మహిళల్ని బలవంతంగా తరలిస్తున్న తీరు పలు విమర్శలకు దారి తీస్తోంది. డ్వాక్రా సంఘాలను మీటింగ్‌కు తీసుకురావాలంటూ ఏపీఎం, సీసీ, యానిమేటర్‌ ఇల్లిల్లు తిరిగి తప్పక రావాలంటూ హుకుం జారీ చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలను అధికార పార్టీ రాజకీయ సభలకు తరలి వచ్చే ముడిసరకుగా మార్చేసింది. ఊరూ, మండలం, జిల్లా, రాష్ట్రం ఎక్కడ సభలున్నా ఆటోల్లో, వ్యాన్లలో కుక్కేసి తెస్తున్నారు. రానని మొండికేశారో ఇక అంతే సంక్షేమ పథకాలు కోతేస్తామని బెదిస్తున్నారు. పోనీ ఎగ్గొడదామా అంటే ఎవరు వచ్చారో, ఎవరు రాలేదో నోట్‌ చేసుకుంటాం? లేదంటే సభ వద్ద సెల్ఫీ తీసుకుని ఆ ఫొటోను వాట్సాప్‌ ద్వారా గ్రామ నాయకులకు ఫోటోలు పంపుతున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు మీటింగ్‌కు హాజరుకావాలని సీడీపీఓ నుంచి గ్రూపుల్లో మెసేజ్‌లు వచ్చాయి. ప్రతి ఒక్కరూ సోమవారం సాయంత్రం జరిగిన నాలుగు గంటలకు పిడుగురాళ్లలోనే జానపాడు రోడ్డులో జరిగే స్త్రీ శక్తి పథకం విజయోత్సవం సభకు హాజరుకావాలని అందులో సందేశం.

క్లుప్తంగా

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

గుంటూరు మెడికల్‌: ఏఆర్టీ, సరోగసి యాక్ట్‌ అమలుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 27 హాస్పిటళ్లు ఏఆర్టీ, సరోగసి యాక్ట్‌లో రిజిస్టర్‌ అయి ఉన్నాయన్నారు. చట్టానికి లోబడి ఉండాల్సిన బాధ్యత 27 ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందన్నారు. తనతోపాటు ప్రోగ్రాం ఆఫీసర్లు తరచుగా ఈ ఆసుపత్రులను తనిఖీ చేస్తారని తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే వారిపై కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్టర్ల నిర్వహణ, ధరల పట్టికలు డిస్‌ ప్లే చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించినట్లు తెలిస్తే ఆయా ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కక్షపూరితంగా తొలగించారు

- శ్రీ సత్యసాయి స్వయం సహాయక సంఘ సభ్యురాలు మైనేని స్రవంతి
- వైఎస్సార్‌ సీపీలో క్రియాశీలకంగా భర్త వ్యవహరిస్తున్నారని కక్ష



తహసీల్దార్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న స్రవంతి

పెదకూరపాడు : తనను కక్షపూరితంగా తొలగించారని శ్రీ సత్యసాయి స్వయం సహాయక సంఘ సభ్యురాలు మైనేని స్రవంతి వాపోయారు. తన భర్త మైనేని ప్రతాప్‌ వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా పార్టీ యువజన విభాగం ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌గా ఉన్నారని కక్షపూరితంగా తనను శ్రీ సత్యసాయి స్వయం సహాయక సంఘం నుంచి అన్యాయంగా తొలగించారని వాపోయారు. ఈ మేరకు మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన మైనేని స్రవంతి తహసీల్దార్‌ ధనలక్ష్మికి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గత పది సంవత్సరాల నుంచి సంఘం సభ్యురాలుగా నిబద్ధతతో వ్యవహరించానని తెలిపారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లింపులు చేశానని, తాము వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నామని తొలగించడం దారుణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్వయం సహాయక సంఘాలపై కూడా రాజకీయాలు ఏమిటని ఆమె ప్రశ్నించారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని స్రవంతి కోరారు.

గ్రానైట్‌ లారీలు స్వాధీనం



కారెంపూడి పోలీస్‌ స్టేషన్‌ బయట ఉన్న గ్రానైట్‌ లారీలు

కారెంపూడి: గ్రానైట్‌ లోడ్‌తో వెళ్తున్న ఎనిమిది లారీలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీలు చేసి సరైన బిల్లులు లేకపోవడంతో వాటిని కారెంపూడి పోలీస్‌స్టేషన్‌ అధికారులకు ఆదివారం రాత్రి అప్పగించారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నారని గుర్తించిన అధికారులు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా చీమకుర్తి నుంచి గ్రానైట్‌తో లారీలు మహారాష్ట్రకు వెళ్తున్నాయి. వాటిలో సరుకు విలువను బట్టి ఒక్కొక్క లారీకి రూ.2.5 లక్షల దాకా జరిమానా విధించే అవకాశం ఉందని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. నరసరావుపేట రహదారిలో జూలకల్లు సమీపంలోను, కారెంపూడి సమీపంలోను కొన్ని లారీలను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

జీజీహెచ్‌లో నకిలీ డాక్టర్‌ హల్‌చల్‌

పోలీసులకు పట్టించిన సూపరింటెండెంట్‌

గుంటూరు మెడికల్‌: గుంటూరు జీజీహెచ్‌ పిల్లల వైద్య విభాగంలో డాక్టర్‌ మాదిరిగా ఓ మహిళ యాప్రాన్‌, సెతస్కోప్‌ ధరించి చికిత్సలు చేసేందుకు హడావుడి చేయడంతో పట్టుపడిపోయింది. గుంటూరుకు చెందిన జ్యోతి గతంలో పిల్లల విభాగంలో తన పిల్లలకు చికిత్స చేయించేందుకు కొన్ని రోజులపాటు ఉంది. రెండు రోజులుగా ఆసుపత్రిలో డాక్టర్‌ మాదిరిగా రౌండ్స్‌ వేస్తూ పిల్లలకు చికిత్స చేసేందుకు హడావుడి చేస్తుండటంతో వార్డుల్లో తనిఖీలు చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ యశశ్వి రమణకు అనుమానం వచ్చి ఆరా తీశారు. ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పడంతో తక్షణమే పోలీసులకు అప్పజెప్పారు. ఆమె వెంట మరో వ్యక్తి ఉండి అచ్చం డాక్టర్‌ మాదిరిగా వార్డులో హడావుడి చేస్తున్నాడని, అకృత్యాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉండటంతో తక్షణమే పోలీసులకు అప్పగించినట్లు సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమణ తెలిపారు.

పేరుగొప్ప.. ఊరు దిబ్బగా ప్రైవేటు వర్సిటీలు

మంగళగిరి టౌన్‌: అమరావతి రాజధాని పరిధిలో వున్న పలు యూనివర్సిటీల్లో ఫీజులు రూ.లక్షల్లో ఉంటున్నాయని, కానీ వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయని, పేరు గొప్ప.. ఊరు దిబ్బగా అవి ఉంటున్నాయని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఎద్దేవా చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం రాత్రి పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. నేతాజీ మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో విట్‌, ఎస్‌ఆర్‌ఎం, ఇతర యూనివర్సిటీలలో విద్యార్థులు రూ.లక్షలు ఫీజులు చెల్లించి చదువుకుంటున్నారని, వారికి మాత్రం నాణ్యత లేని అపరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారని విమర్శించారు. 15 రోజుల క్రితం విట్‌ యూనివర్సిటీలో ఆహారం సరిగా లేదంటూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారని, అది మరువక ముందే ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారంటూ విద్యార్థులు ఆందోళనకు దిగడం యాజమాన్యాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆహార పదార్థాలను తనిఖీ చేసే అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. పూలింగ్‌ చట్టంలో ఉన్న విధంగా రాజధానిలో నిర్మించిన విశ్వవిద్యాలయాల్లో ఆ ప్రాంత విద్యార్థులకు రాయితీలు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అమలు కావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆయా యూనివర్సిటీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని నేతాజీ డిమాండ్‌ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌ఎస్‌ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌ లాల్‌, సీనియర్‌ నాయకులు జేవీ రాఘవులు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కమలాకర్‌, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్‌ పోస్టు ‘సర్వీసుకు’ స్వస్తి

సత్తెనపల్లి: అత్యంత పురాతన ప్రభుత్వ రంగ సంస్థ పోస్టల్‌. ఎప్పుడో బ్రిటిష్‌ కాలంలో ప్రారంభమైన ఈ తపాలా వ్యవస్థ ఇప్పటికీ పటిష్టంగా కొనసాగుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త పుంతలు తొక్కుతోంది. సంస్కరణల్లో భాగంగా ‘రిజిస్టర్‌ పోస్టు’ సర్వీసుకు స్వస్తి పలికింది. 171 ఏళ్ల సేవలందిస్తున్న రిజిస్టర్‌ పోస్టు సర్వీసును ఆగస్టు 30తో నిలిపివేశారు. దీనిని స్పీడ్‌ పోస్ట్‌లో విలీనం చేశారు. దేశ వ్యాప్తంగా నడుస్తున్న పోస్టల్‌ కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి వచింది. ఇప్పటికే పోస్టల్‌ వినియోగదారులకు నాణ్యమైన సులభతరమైన సేవలు అందించటానికి నూతన సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే రిజిస్టర్‌ పోస్టు సేవలకు సెలవు ప్రకటించారు. ఈ సేవలను రద్దుచేసి స్పీడ్‌ పోస్ట్‌ ద్వారా స్థానికంగా అయితే అదే రోజు, ఇతర ప్రాంతాలకు మరుసటి రోజు చేరే విధంగా చర్యలు చేపడుతున్నారు. దీంతో పౌర సేవలు వేగవంతం సులభతరం అవుతాయని తపాలా శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌ ఒకటి నుంచి స్పీడ్‌ పోస్ట్‌ విధానం మాత్రమే అందుబాటులోకి రానుంది.

సత్తెనపల్లి సబ్‌జైలులో రిమాండ్‌ ఖైదీకి గాయాలు

సత్తెనపల్లి: రిమాండ్‌ ఖైదీకి గాయాలైన సంఘటన సత్తెనపల్లిలోని సబ్‌జైల్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాలెం అనుపాలేనికి చెందిన మెర్నేటి గోపీకృష్ణ దేవాలయాల దొంగతనం కేసులో 45 రోజుల కిందట రిమాండ్‌ ఖైదీగా సత్తెనపల్లి సబ్‌ జైలుకు వచ్చాడు. సోమవారం బాత్రూమ్‌ దగ్గర టైల్స్‌పై జారీ పడి గాయంకావడంతో సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం సబ్‌జైలు సిబ్బంది తీసుకెళ్లారు. గోపీకృష్ణ ఆత్మహత్యకు యత్నించే క్రమంలో చెయ్యి కోసుకోగా 25 కుట్లు పడినట్లు సమాచారం.

రైతులకు సరిపడా యూరియా సరఫరా

జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో యూరియాను రైతు అవసరాలకు మించి ఇప్పటికే సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్‌ సీజన్‌కుగాను ప్రధాన పంటలైన వరి, పత్తి పంటలను 77,340 హెక్టార్లలో సాగు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికీ జిల్లాలో 1,774 మెట్రిక్‌ టన్నుల యూరియా చిల్లర వర్తకులు, 2,014 మెట్రిక్‌ టన్నులు యూరియా టోకు వర్తకుల వద్ద కలిపి మొత్తం 3,788 మెట్రిక్‌ టన్నుల యూరియా రైతుల అవసరార్థం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌ పాయింట్ల ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్‌ల ఆధ్వర్యంలో పంటల సాగు ఆధారంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ గ్రామాల్లోని ఆర్‌ఎస్‌కే కేంద్రాలను సంప్రదించి యూరియాను పొందవచ్చని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

పలు గ్రామాల్లో పర్యటించిన శాస్త్రవేత్తల బృందం



నాగిరెడ్డిపాలెంలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం, అధికారులు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగు క్షేత్రాలను సోమవారం శాస్త్రవేత్తల బృంద సభ్యులు పరిశీలించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ కె.అమల కుమారి శాస్త్రవేత్తల బృందానికి ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. మండలంలోని నాగిరెడ్డిపాలెంలో రైతు చింతారెడ్డి మహాలక్ష్మి వరి పొలంలో సాగు చేస్తున్న నాలుగు పద్ధతులను శాస్త్రవేత్తలకు వివరించారు. గ్రామంలోని ప్రకృతి వనరుల కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు అందజేస్తున్న కషాయాలు, ద్రావణాల గురించి ప్రాజెక్టు మేనేజర్‌ తెలియజేశారు. బీజామృతం తయారీ విధానాన్ని లైవ్‌ డెమో నిర్వహించి, విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మండలంలోని చంద్రాజుపాలెంలో రొయ్యల మంగమ్మ సాగు చేస్తున్న కూరగాయలు, ఏటీఎం మోడల్‌లో సాగు విధానాలను పరిశీలించారు. భూమి ఆరోగ్యంగా ఉండాలంటే రసాయనాలను వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో లీడ్‌ ప్రిన్సిపల్‌ సైంటిస్టులు నాగ మాధురి, శ్రీలేఖ, యూఏఎస్‌ మాజీ వైస్‌ చాన్స్‌లర్‌ రాజేంద్రప్రసాద్‌, క్రోసూరు డివిజన్‌ ఏడీఏ మస్తానమ్మ, అడిషనల్‌ డీపీఎం ప్రేమ్‌రాజ్‌, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడెడ్‌ అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు నింపిన మాణిక్యరావు

మాజీ ఎమ్మెల్సీ కేఎస్‌ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్‌ లక్ష్మణరావు

చిలకలూరిపేట: ఎయిడెడ్‌ అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత దివంగత ఎంజే మాణిక్యరావుకు దక్కుతుందని మాజీ ఎమెల్సీ కేఎస్‌ లక్ష్మణరావు చెప్పారు. పూర్వ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు, ఆక్టా నాయకుడు దివంగత ఎంజే మాణిక్యరావు శతజయంతిని పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో రిటైర్డ్‌ లెక్చరర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగభద్రత లేక బానిసల మాదిరి జీవితాలు గడుపుతున్న ఎయిడెడ్‌ కళాశాల లెక్చరర్ల జీవితాలను చూసి 1972లో రాష్ట్ర వ్యాప్త సమ్మె పిలుపునిచ్చారని తెలిపారు. సమ్మె ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్‌ కళాశాలల అధ్యాపకులకు ఉద్యోగభద్రత, పెన్షన్‌ విధానం గవర్నమెంట్‌ లెక్చరర్లతో సమానంగా లభించాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంజే మాణిక్యరావు మెమోరియల్‌ కమిటీ కార్యదర్శి డాక్టర్‌ మోజస్‌, రిటైర్డ్‌ కాలేజ్‌ లెక్చరర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ కృష్ణారావు, జీఆర్‌కే రెడ్డి, జీవీ రాఘవులు, తోటకూర వెంకటనారాయణ, టి వెంకటేశ్వరరావు, ఎం లక్ష్మీనారాయణ, పీఎస్వీ ప్రసాద్‌, కె రామారావు, ఆళ్ల వేమనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.